క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు

- దేదీప్యమానంగా వెలిగిపోతున్న ప్రార్థన మందిరాలు
- ఏసుక్రీస్తుకు స్వాగతం పలుకుతూ.. ప్రార్థనలకు ఏర్పాట్లు సిద్ధం
- సేవా కార్యక్రమాల్లో భక్తులు

తెనాలిరూరల్: తెనాలి పట్టణంలో వాడవాడలా క్రిస్మస్ సందడి నెలకొంది. లోక రక్షకుడు ఏసు క్రీస్తు జన్మదినం జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. ప్రధాన వీధులు విద్యుత్ వెలుగులతో ఆకర్షణీయంగా మారాయి. ఐతానగర్‌చ చినరావూరు, మారీసుపేట రెండు గేట్ల మధ్య ప్రాంతాల్లో విద్యుత్ దీపాలతో ఆయా ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఇక పట్టణంలోని ప్రధానమై చర్చిలు కాంతులీనుతున్నాయి.

కార్మికులకు రగ్గులు పంపిణీ

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మదర్ థెరిస్సా హెల్ప్‌లైన్ డైరెక్టర్ అత్తోట అమృతరాజు రగ్గులు, దుప్పట్లను ఆదివారం పారిశుద్ధ్య కార్మికులు, అనాథలకు పంపిణీ చేశారు. ఐతా నగర్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చి వద్ద వీటిని అందజేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

తెనాలిఅర్బన్: సెమీ క్రిస్మస్ వేడుకలను ఐతా నగర్‌లోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో శనివారం రాత్రి నిర్వహించారు. దైవజనులు వి.ఏసుపాదం క్రీస్తు సందేశాన్ని అందించారు. అనంతరం సంఘస్థులు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు పుట్టుక నాటికను చిన్నారులు ప్రదర్శించారు. వి.ప్రశాంతకుమారి, పి.నాగరాజు, రత్నసుందరీ, వి.జక్రయ్య, జి.రవికుమార్ పాల్గొన్నారు. సాల్వేషన్ ఆర్మీ చర్చిలో క్యాథరిన్ బూత్ గర్ల్స్ హాస్టల్‌లోని విద్యార్థులకు ఆదివారం దుస్తులు, రగ్గులు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. యాకోబు మాసి, సుమిత్ర మాసి తదితరులు పాల్గొన్నారు.


ఐతానగర్‌లోని లూథరన్‌చర్చి


విద్యుత్ కాంతుల్లో బోస్‌రోడ్డులోని టౌన్ చర్చి


విద్యుత్ కాంతులతో ఐతానగర్‌లోని సాల్వేషన్ ఆర్మీ చర్చి



జయప్రకాష్ నగర్‌లో ఏర్పాటు చేసిన పశువుల పాక నమూన


దుస్తులు పంపిణీ చేస్తున్న యాకోబ్ మాసి


రగ్గులు, దుస్తులు పంపిణీ చేస్తున్న అమృతరాజు


ఐతా నగర్‌లో కేక్ కట్ చేస్తున్న సంఘ సభ్యులు

యువజన విభాగం మండలాధ్యక్షుడిగా యశ్వంత్‌రెడ్డి



కొల్లిపర: వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడిగా కొల్లిపర గ్రామానికి చెందిన ఈదా యశ్వంత్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన తన మిత్ర బృందంతో తెనాలి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. యశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు. లంకిరెడ్డి సుధాకర రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, చెంచల రామిరెడ్డి, భీమవరపు రామిరెడ్డి, బొమ్ము మోహన్‌రెడ్డి, శనివరపు వంశీ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

రేపల్లె రూరల్: ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో పెనుమూడి గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, బాలబాలికలకు ఆటల పోటీలు ఆదివారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ దారం విజయ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, నాయకులు ఝాన్సీ, సూర్యప్రకాష్, హైమ, నాగశ్రీ, లక్ష్మణరావు, నవీన్, మావో పాల్గొన్నారు.

క్లుప్తంగా

శిశు మందిర్‌లో రామానుజన్ జయంతి

తెనాలిఅర్బన్: శ్రీనివాసా రామానుజన్ జయంతిని సరస్వతీ శిశు మందిర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు వై.చింతయ్య మాట్లాడుతూ రామానుజన్ తమిళనాడులో జన్మించి గణితంలో మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారని చెప్పారు. గణితంలోని అనేక చిక్కుముళ్ళను విప్పారని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, కోడూరు మల్లికార్జునరావు, యర్రంశెట్టి హనుమంతరావు పాల్గొన్నారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



తెనాలిఅర్బన్: ఏపీ ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ మెయింటెనెన్స్ అండ్ ప్రాజెక్టు ఎస్టాబ్లిష్‌మెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అమరావతి ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను ఏపీజేఏసీ రాష్ట్ర నాయకుడు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు ఆవిష్కరించారు. తెనాలిలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు వి.గణేష్, సత్యనారాయణ, ఆర్‌వీ రాఘవయ్య, ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో స్థానిక యడ్ల లింగయ్య కాలనీ, కొలకలూరు, నందులపేట, కఠెవరం ప్రాంతాల్లో చిత్తు కాగితాలు ఏరుకుని జీవించే వేస్ట్ పికర్స్‌కు బియ్యం, కందిపప్పు, నూనె, చింతపండు, పంచదార తదితర నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో వారు పడుతున్న ఇబ్బందులను గమనించి దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సీఈవో అల్లాడి దేవకుమార్ మొత్తం 120 మందికి నిత్యావసరాలను అందించారు. స్థానిక న్యాయవాది కేసీ బసవయ్య, డీబీఆర్‌సీ ప్రతినిధి రాజశేఖర్, వెంకటరమణ పాల్గొన్నారు.

డాక్టర్ వుళ్లక్కికి ఘన నివాళి



తెనాలి రూరల్: తెనాలి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, మేజర్ కాకుమాను వుళ్ళక్కి వర్ధంతిని తెనాలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బోసు రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పేద ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి శాఖ అధ్యక్షురాలు డాక్టర్ జె. విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, వైద్యులు గోగినేని లక్ష్మీప్రసాద్, డాక్టర్ విశ్వమోహనరావు, డాక్టర్ వి. శేషగిరిరావు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ జేవీ సుబ్బారావు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన ఉండాలి



తెనాలిఅర్బన్: వినియోగదారుల పరిరక్షణ చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని తెనాలి వినియోగదారుల సంఘ అధ్యక్షుడు ఆర్ఎస్.శంకరరావు పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని మారీసు పేటలోని ఎన్‌సీఆర్ఎన్ఎంహెచ్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణంలో ఏదైనా వస్తువు కొంటే తప్పని సరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. సంఘ కార్యదర్శి డీవీ సోమయ్య శాస్త్రి మాట్లాడుతూ వస్తువు కొనే ముందు ఎక్స్‌పైరీ డేట్, ఎమ్మార్పీ గమనించాలన్నారు. అలాగే తూకం పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో శేఖర్ స్వామి, వినియోగదారులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు

కర్లపాలెం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఏవో ఎం.సుమంత్‌కుమార్ తెలిపారు. పంట నమోదు చేయించుకున్న రైతులందరూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించాలని చెప్పారు. ధాన్యం క్వింటాకు గ్రేడ్-ఎ రకం రూ.2,203లు, సాధారణ రకం రూ.2,183లకు కొనుగోలు చేస్తారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యంలో 17శాతం తేమ ఉండాలని ఏవో తెలిపారు.

చిరస్మరణీయుడు మోదుకూరి జాన్సన్

తెనాలి: సుప్రసిద్ధ నాటక, సినీ రచయిత మోదుకూరి జాన్సన్ 35వ వర్ధంతిని ఆదివారం స్థానిక గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. మోదుకూరి జాన్సన్ కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటూరు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాన్సన్ అభిమానులు పలువురు పాల్గొని, ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. నాటి సామాజిక పరిస్థితులపై ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా జాన్సన్ చేసిన రచనలు నేటికీ ప్రాచుర్యంలో ఉన్నాయని గుంటూరు కృష్ణ చెప్పారు.

ఉపాధ్యాయుడు కనపర్తి బెన్‌హర్‌బాబు మాట్లాడుతూ నాటక రంగంలో నిచ్చెన మెట్లు, నటనాలయం, దేవాలయం, సినీ రంగంలో మానవుడు-దానవుడు, డబ్బుకులోకం దాసోహం, కరుణామయుడు సినిమాలు జాన్సన్ రచనా పటిమకు నిదర్శనమన్నారు. సమాజ మార్పును కాంక్షిస్తూ జాన్సన్ రచనలు చేశారన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్, సహజ కవి అయినాల మల్లేశ్వరరావు, సుంకర విశ్వేశ్వరరావు, కేవీఎస్‌వీ ప్రసాద్, కొమ్ము అబ్రహాం లింకన్, చిలకా సుధాకర్‌బాబు, వైఎంసీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డి.అమర్‌నాథ్, కె.ఆంజనేయులు, పి.శివకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కృష్ణ, అభిమానులు

విద్యావంతులుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: దూరవిద్యతో విద్యావంతులుగా ఎదగాలని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షల విభాగ డైరెక్టర్ నాగేశ్వరరావు సూచించారు. పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దూరవిద్య టెన్త్ విద్యార్థుల శిక్షణ తరగతుల్ని ఆదివారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు శిక్షణ తరగతులు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ఓపెన్ స్కూల్ పరీక్ష విధానంలో ప్రభుత్వం తెచ్చిన మార్పులతో మెటీరియల్ నేరుగా అభ్యర్థుల ఇళ్లకు పంపించినట్లు తెలిపారు.

డాక్టర్ శ్రీనివాసరెడ్డికి గోల్డ్ మెడల్



తెనాలిరూరల్: డాక్టర్ మేజర్ కాకుమాను వుళ్లక్కి స్మారక బంగారు పతకాన్ని డాక్టర్ కారుమూరు శ్రీనివాసరెడ్డికి ప్రదానం చేశారు. బోస్ రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం గుండె జబ్బుల కారణాలను డాక్టర్ శ్రీనివాసరెడ్డి వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు డాక్టర్ మేజర్ కాకుమాను వుళ్లక్కి స్మారక బంగారు పతకం ప్రదానం చేశారు. ఐఎంఏ తెనాలి శాఖ బాధ్యులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ కె. అనిల్‌కుమార్, డాక్టర్ కె. శ్యామ్ ప్రసాద్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ టి. మస్తానమ్మ, డాక్టర్ జగదీశ్వరి, డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, డాక్టర్ కామినేని రమేష్ తదితర వైద్యులు పాల్గొన్నారు.

ఆధునిక జీవనశైలితోనే గుండె జబ్బులు

తెనాలి: ఆధునిక జీవనశైలి మనిషి గుండెపై పలు దుష్ప్రభావాలు చూపుతోందని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగిన సభకు క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 'గుండె జబ్బులు-కారణాలు' అనే అంశంపై డాక్టర్ శ్రీనివాసరెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. భారతదేశంలో దైనందిన జీవనంలో పెరిగిన వేగం, వివిధ వృత్తుల్లోని పోటీతో మానసిక ప్రశాంతత లోపిస్తోందని తెలిపారు. ఆదుర్దా, ఆందోళనలు గుండెపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ప్రతిరోజూ వ్యాయామం చేయటం, జీవన శైలిని మార్చుకోవటంతో గుండెజబ్బుల నుంచి నివారణ పొందవచ్చని సూచించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి తొలుత డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సభకు పరిచయం చేశారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరించారు. కోశాధికారి సీహెచ్ అశోక్‌కుమార్ స్వాగతం పలికారు.


డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ బాధ్యులు

పిల్లల్లో పెరుగుతున్న మానసిక సమస్యలు

గుంటూరు మెడికల్: చిన్నారుల్లో నేడు మానసిక సమస్యలు పెరగడం చాలా బాధాకరమైన విషయమని సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ కొసరాజు కళాధర్ అన్నారు. స్థానిక సాంబశివ పేటలో శనివారం పిల్లలు, స్త్రీల కోసం ప్రత్యేకంగా నూతనంగా నిర్మించిన 'పాథ్‌వేస్ సైకాలజీ' మానసిక వైద్యశాలను డాక్టర్ కొసరాజు కళాధర్, డాక్టర్ భువనేశ్వరి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి వల్ల నేడు తల్లిదండ్రులు పిల్లలతో చాలా తక్కువ సమయం గడుపుతున్నారని చెప్పారు. పిల్లల చేతులకు ఫోన్లు అప్పగించి సొంత పనుల్లో మునిగి తేలడంతో సరిగా మాటలు పలకలేకపోవడంతో పాటు పలు రకాల మానసిక సమస్యల బారినపడుతున్నారని వెల్లడించారు. మానస హాస్పిటల్ అధినేత, మానసిక వైద్యనిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్. నరసింహారావు, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఇవటూరి శరత్‌చంద్ర మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన పాథ్‌వేస్ సైకాలజీ మానసిక చికిత్సా కేంద్రంలో పిల్లల్లో వచ్చే వివిధ రకాల మానసిక సమస్యల్ని ముందస్తుగానే గుర్తించి చికిత్స అందించే ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పిల్లల చికిత్సలో ప్రత్యేక శిక్షణ పొందిన డాక్టర్ శ్రీరమ్య పర్యవేక్షణలో వైద్యసేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. స్త్రీల మానసిక రుగ్మతల కోసం ఉమెన్ వెల్‌నెస్ సెంటర్ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. సీనియర్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ యస్.వి.రమణారావు, హైదరాబాద్ ఆషా హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ కె. చంద్రశేఖర్, డాక్టర్ జి. ప్రసాదరావు, ఖమ్మంకు చెందిన సైకియాట్రిస్ట్ డాక్టర్ ఆర్. సతీష్ బాబు, డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఏ. హనుమంతరావు , డాక్టర్ ఏ. శ్రీనివాసరావు పలు వైద్య విభాగాల్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ వైద్య నిపుణులు పాల్గొని డాక్టర్ శ్రీరమ్యను అభినందించారు.


హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కొసరాజు కళాధర్, డాక్టర్ భువనేశ్వరి దంపతులు

పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా సాంబశివరావు

తెనాలి: తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా అచ్యుత సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గీతా మందిరం ప్రాంగణంలో ఆదివారం జరిగిన ఎన్నికకు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నవరపు రమేష్, సుగ్గుల సురేష్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అచ్యుత సాంబశివరావు పేరును వంకదారు శివసుధాకర్, చీమకుర్తి వెంకటరమణ ప్రతిపాదించి బలపరిచారు. వేరే ప్రతిపాదన లేకపోవటంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఆర్యవైశ్య నేతలు సాధు ప్రతాప్, కొల్లా గురునాథ గుప్తా, మాలేపాటి తిరుమలేశ్వరరావు, మాలేపాటి వేణుమాధవరావు, గుండా రామకోటేశ్వరరావు, కొత్త రామారావు, ఎంఎస్ఆర్ గుప్తా, ఇమ్మడి మాధవ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అచ్యుత సాంబశివరావు, ఆర్య వైశ్య నేతలు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.


ఎన్నిక ధ్రువీకరణ స్వీకరిస్తున్న అచ్యుత సాంబశివరావు

సమాజంలో వివాహ వ్యవస్థ ఎంతో కీలకం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో వివాహ వ్యవస్థకు ఎంతో గౌరవ ప్రదమైన స్థానముందని, కుటుంబాల మధ్య బాంధవ్యాలను నెలకొల్పడంలో అది ఎంతో కీలకమని గుంటూరు వైద్య కళాశాల సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి పేర్కొన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో ఆదివారం ఆర్యవైశ్య అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆర్య వైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉమాజ్యోతి వివాహానంతరం ఇరువైపులా తల్లిదండ్రులు పోషించాల్సిన పాత్ర, వధూవరుల మనస్సులపై కుటుంబ సభ్యుల ప్రవర్తనకు సంబంధించిన అంశాల్ని వివరించారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త కె.వి.కోటేశ్వరరావు మాట్లాడుతూ వివాహ వ్యవస్థలో వేద మంత్రోచ్చారణకు గల ప్రాముఖ్యత, జీలకర్ర-బెల్లం ప్రాధాన్యతను వివరించారు. జిల్లా పరిశ్రమల అధికారి ఎస్. మదన్‌మోహన్ శెట్టి మాట్లాడుతూ వధూవరులు కోరికల్ని తగ్గించుకుని, సరైన వయస్సులో వివాహాలు చేసుకోవాలని సూచించారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాల్లో వధూవరుల పరిచయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నాగేశ్వరరావు, గుంటూరు శాఖ అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి సుబ్బారావు, పరిచయ వేదిక కన్వీనర్ శివ సుధాకర్, సాయి రమేష్, మురళీకృష్ణ, వధూవరులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


వధూవరుల పరిచయ వేదిక నిర్వాహకులతో డాక్టర్ ఉమాజ్యోతి

ప్రార్థన మందిరాలకు అరటి గెలల పంపిణీ

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి మండల పరిధిలో ఉన్న క్రైస్తవ ప్రార్థన మందిరాలకు పంపిణీ చేసేందుకు అరటి గెలలను, స్వీట్ బాక్సులను పాస్టర్స్ ఫెలోషిప్ మండలా అధ్యక్షుడు రమేష్‌కు ఆదివారం అందజేశారు. ప్రార్థన మందిరాలకు అరటి గెలలను, కేకులను అందజేసిన ఎమ్మెల్యే కోన రఘుపతికి, సినీ రచయిత కోన వెంకట్ ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, భానుప్రసాద్, నాని, మార్పు బెనర్జి కంకిపాటి నాగరాజు పాల్గొన్నారు.

అనాథలకు నూతన వస్త్రాల పంపిణీ

రేపల్లె రూరల్: అనాథలను ఆదుకోవటం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని గరువు రోడ్డులో ఉన్న రేపల్లె చిల్డ్రన్స్ హోమ్‌లో చిన్నారులకు క్రిస్మస్ పండగను పురస్కరించుకుని మాజీ కౌన్సిలర్ చెన్ను లక్ష్మణరావు అందించిన నూతన వస్త్రాలను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. అనాథలమన్న భావనను చిన్నారులు తమ మనస్సులోకి రానివ్వకూడదని కోరారు. చిన్నారులకు 20 సంవత్సరాలుగా నూతన వస్త్రాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. 48 మంది చిన్నారులకు, వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, నిర్వాహకుడు నాయుడు బాబూరావు, నాయకులు చెన్ను లక్ష్మణరావు, షేక్ సుభానీ పాల్గొన్నారు.


నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీ మోపిదేవి